క్లుప్తంగా

రేపు ఆర్మీ డే వేడుకలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత ఆర్మీ డే వేడుకలు ఈ నెల 19న స్థానిక కోటదిబ్బ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న మాజీ సైనికోద్యోగుల సంఘ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతాయని ఏలూరు జిల్లా మాజీ సైనికోద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పీబీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సాయుధ దళాల వారు, వీరనారీలు, వీరమాతలు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

గిరిజనులకు న్యాయం జరిగేదెప్పుడో ?

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో గిరిజనులకు న్యాయం జరిగే పరిస్థితి కనిపించడం లేదని ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.కృష్ణా నాయక్, డి.రాజబాబు నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో గిరిజన లంబాడి తండాల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం ఇచ్చేందుకు గురువారం ఏలూరులోని డీపీఓ కార్యాలయానికి వెళ్లామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరీక్షించినా కార్యాలయం లోపల నుంచి తమకు పిలుపు రాలేదని, గత్యంతరం లేక వెళ్లిపోయామని వివరించారు. ఈ విషయంపై తక్షణమే ఆ శాఖ మంత్రి జోక్యం చేసుకొని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సందర్శకుల సమయాలను ప్రదర్శించాలని, సందర్శకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించేలా, బాధితుల సమస్యలను విని పరిష్కరించేలా డీపీఓకు మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



పిల్లలు గేయాలను ఆలకిస్తున్న ఐసీడీఎస్ పీడీ శారద, సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రెహమత్ నగర్, జయప్రకాష్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద శుక్రవారం సందర్శించారు. ఆయా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలును ప్రీస్కూల్ యాక్టివిటీస్, పిల్లల ఎత్తులు, బరువులు, గర్భిణులు, బాలింతల ఎత్తు, బరువులు, ఎఫ్ఆర్ఎస్‌ను పరిశీలించారు. వారికిచ్చే సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో అభినయ గేయాలు చెప్పించారు. పిల్లలకు దోహదపడే శారీరక, సాంఘిక, గణిత అభివృద్ధి, మేధోవృద్ధిపై ఆరా తీశారు. అనంతరం పోషణ వాటికను సందర్శించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.పద్మావతి సూపర్‌వైజర్ మౌనిక, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

‘గోకులం’.. పాడి రైతుల్లో నైరాశ్యం

- నిబంధనలతో అందని పథకం
- షెడ్ల నిర్మాణం పూర్తయ్యాకే నిధులు విడుదల
- ముందుకు రాని రైతులు



మాదేపల్లిలో కౌలురైతు పంట కాలువ పక్కన కట్టిన పశువులు

ఏలూరు రూరల్ : గోకులం పథకం పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. షెడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండాలన్న నిబంధనతో రైతులు అనర్హులుగా మిగులుతున్నారు. షెడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా ఏలూరు రూరల్ మండలంలో మంజూరైన 10 యూనిట్లలో ఇప్పటివరకు కనీసం 5 కూడా పూర్తి కాలేదు.

కౌలు రైతులకు వర్తించని వైనం

ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో 6,500 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇందులో 75 శాతం భూమి కౌలుదారులే సాగు చేస్తున్నారు. వరి సాగుతో పాటు పశువులను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. భూ యజమానికి నుంచి కౌలుకు తీసుకున్న చేలు, పంట బోదె, పోరంబోకు స్థలాల్లో పశువులను కట్టి మేపుకుంటున్నారు. పంట కోసిన తర్వాత వచ్చిన ఎండి గడ్డి, ఖరీఫ్, రబీ సాగుకు ముందు చేలు, గట్లపై మొలిచిన పచ్చగడ్డిని పశువులకు దాణాగా వినియోగిస్తున్నారు. వీరికి సొంత స్థలం లేకపోవడంతో కౌలు చేస్తున్న భూమి సర్వే నెంబర్ పేర్కొని పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు భూ యజమానులు ఒప్పుకోవడం లేదు. దీంతో పాడి పరిశ్రమపై ఆధారపడ్డ కౌలు రైతులకు గోకులం వర్తించడంలేదు. భూమి ఉన్న రైతులు పాత షెడ్లను తొలగించి, ప్రభుత్వం ఇచ్చే 90 శాతం నిధులతో కొత్త షెడ్లను నిర్మించుకుంటున్నారు.

లబ్ధిదారుడి వాటా 10 శాతం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గోకులం పథకం అమలు చేస్తోంది. గోకులం షెడ్డు నిర్మాణానికయ్యే మొత్తం ఖర్చులో లబ్ధిదారుడు 10 శాతం, ప్రభుత్వం 90 శాతం భరిస్తుంది. అంటే రూ.లక్షకు రూ.10 వేలు లబ్ధిదారుడు భరిస్తే, మిగిలిన రూ.90 వేలు ప్రభుత్వం అందిస్తుంది.

చేతులెత్తేస్తున్న అర్హులు

గత టీడీపీ హయాంలో గోకులం షెడ్లు కట్టకుండానే పార్టీ నాయకులు, కార్యకర్తలు నిధులు కాజేసినట్టు తేలింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ హయాంలో గోకులంపథకాన్ని రద్దు చేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం గోకులం పథకం ఆచరణలో పెట్టింది. అయితే షెడ్ల నిర్మాణంలో జియో ట్యాగింగ్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన టీడీపీ సానుభూతిపరులకు అడ్డంకిగా మారింది. షెడ్డు కట్టకుండా నిధులు కాజేయాలన్న పాచిక పారడం లేదు. జూలిపూడి, కాట్లంపూడి తదితర గ్రామాల్లో అర్హత ఉన్న రైతులు గోకులం పథకం వద్దంటూ చేతులెత్తేశారు.

నిబంధనలు పాటించాలి

గోకులం పథకంలో ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలు పాటించాల్సిందే. షెడ్డు పక్కాగా కట్టిన వారికే నిధులు మంజూరవుతాయి. ఈ పనులన్నీ ఎంఎస్ఆర్ఈజీఎస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారు. ఏలూరు రూరల్ మండలానికి 10 యూనిట్లు మంజూరయ్యాయి. ఈ యూనిట్లు మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి, చాటపర్రు, మల్కాపురం గ్రామాలకు కేటాయించాం. స్థలం ఉందా లేదా అని పరిశీలించే షెడ్లు మంజూరు చేశాం. – ఎం లక్ష్మి, చాటపర్రు పశువైద్యురాలు

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలు ఏర్పాటుచేయాలి



శ్రీ కృష్ణదేవరాయలుకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రభోజుడు, పరిపాలనా దక్షుడు, విజయనగర సామ్రాజ్యానికి యాదవ రాజు అయినటువంటి శ్రీకృష్ణదేవరాయలు 554వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా యాదవ సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లాకు ఒక శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉక్కుసూరి గోపాల కృష్ణ, చిదరబోయిన శ్రీనివాసరావు, దిమ్మిటి సాయి శంకర్, వీర్ల దుర్గాప్రసాద్, కిలారపు బుజ్జి, ఆకుల గంగాధర్, మేకల మూర్తి, చిట్టిబోయిన సాయిబాబు, పిలగల వెంకటేశ్వరరావు, పుట్టి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి సాయంకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన మద్దూరి వెంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ శ్రీ అంబరీషోపాఖ్యానం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన దివ్య సుహాసిని శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బలరామావతారంలో జనార్దన స్వామి



జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, విశేష అర్చన చేశారు. జనార్దన గోష్ఠి ప్రతినిధులచే సహస్రనామ పారాయణ నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగమునేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలి



పదోన్నతి పత్రాలు అందజేస్తున్న ఫొటోలను చూపుతున్న డ్రైవర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖలో పని చేస్తూ హెవీ వెహికల్ డ్రైవర్లుగా పదోన్నతి పొందిన వారికి పదోన్నతి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2022 మార్చి 30న నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖలో పనిచేస్తున్న 8 మంది, ఇంజినీరింగ్ శాఖలో పనిచేస్తున్న ఒకరికి హెవీ వెహికల్స్ డ్రైవర్లుగా పదోన్నతి ఇచ్చిందన్నారు. నాటి నుంచి డ్రైవర్ల స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించకుండా, వర్కర్లకు చెల్లించే విధంగా వేతనాలే చెల్లిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్షిక, అడాక్ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా 9 మంది డ్రైవర్లకు జీతభత్యాలలో లక్షలాది రూపాయలు నష్టం కలిగించారని తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ మేయర్, కమిషనర్, అదనపు కమిషనర్లకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ల సమస్య పరిష్కారం కానిపక్షంలో ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థ మేనేజ్మెంట్ వెంటనే స్పందించి పదోన్నతి పొందిన డ్రైవర్లకు వేతనం, వార్షిక, అడాక్ ఇంక్రిమెంట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తాడేపల్లి శేఖర్, అంతర్వేది శేఖర్, ఏబీ ఆంథోనీ పాల్, పంతం వెంకటేశ్వరరావు,గాడి అప్పారావు, మోదుగు గోవిందు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



ఇంటర్మీడియట్ బోర్డు అధికారికి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, విద్యాశాఖ ఆదేశాలను తుంగలో తొక్కి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న నగరంలోని ప్రైవేటు పాఠశాల, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ, ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కార్యాలయాల్లో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ స్థానిక శాంతి నగర్ 3వ రోడ్డులో ఉన్న ఒక ప్రైవేటు పాఠశాల, కళాశాలల యాజమాన్యం సంక్రాంతి సెలవులైనప్పటికీ విద్యార్థులను విద్యా సంస్థలకు రప్పించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, వివిధ పరీక్షలు కూడా నిర్వహిస్తూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎం యశ్వంత్, వై.శాంతి కిరణ్ పాల్గొన్నారు.

వీర రాఘవరెడ్డి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): రైతు నేత పెంటపాడు గ్రామానికి చెందిన నల్లమిల్లి వీరరాఘవ రెడ్డి మృతికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వీరరాఘవరెడ్డి ముదునూరు సొసైటీ అధ్యక్షుడిగా, రాష్ట్ర రైతు కార్యచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సర్ కాటన్ రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు



టైటస్ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

ఏలూరు టౌన్: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో దగ్గు, జలుబు, ఆయాసం వంటి అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, అశ్రద్ధ వహిస్తే ప్రాణాంతక బ్రాంకైటీస్, నియోనియా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ఏలూరు తాపీమేస్త్రీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత అన్నారు. ఏలూరు టైటస్ నగర్ ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అనారోగ్య సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యూపీహెచ్‌సీలో 63 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, శీతాకాలంలో చలి గాలులు వీస్తోన్న పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మలేరియా విభాగం అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని నిల్వ ఉంచటంతో దోమలు వృద్ధి చెందుతాయని, మలేరియా, డెంగీ కారక దోమలు వ్యాప్తితో ప్రాణాంతక వ్యాధుల బారిన పడే పరిస్థితులు ఏర్పడతామని వివరించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	17

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	01
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	10
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	00
ఏలూరు-బీహెచ్ఈఎల్	21.55	98519	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	54	బిళ్లచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	36-44	చామదుంపలు	40
బెండకాయలు	28	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	60
కాకర కాయలు	44	బీట్‌రూట్	44
బీరకాయలు	44	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	00	ఫ్రెంచ్‌బీన్స్	88
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	52	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	52	పాలకూర	10
బంగాళదుంపలు	32	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07
దోసకాయలు	36	పుదీనా	05
అనబకాయ (1)	20-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

అక్షజ ప్రాజెక్టులో ‘సెయింట్ థెరిస్సా’

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాకు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన అక్షజ ప్రాజెక్టులో తమ కళాశాల భాగం కావడం గర్వంగా ఉందని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ పి.మెర్సీ అన్నారు. అక్షజ ప్రాజెక్టుపై కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. నాటి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చొరవతో ఏలూరు జిల్లాలోని మూడు గిరిజన మండలాలు బుట్టాయిగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లిలో గుర్తించిన పోషకాహార లోపంతో ఉన్న ఆరేళ్లలోపు పిల్లలను 999 మందికి అంగన్‌వాడీ ఆహారంతో పాటుగా 6 నెలల పాటు ప్రోటీన్ పౌడర్‌ను అందించామని, 232 మంది గర్భిణులకు మునగాకుతో చేసిన లడ్డూలను పంపిణీ చేశామని తెలిపారు. పిల్లలు బరువు, ఎత్తు పెరిగారని, గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరిగిందని వివరించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రాతినిధ్యం వహించిన అధ్యాపకులు జ్యోతి కుమారి, పద్మజలను అభినందించారు. తమ విద్యార్థినులు ప్రోటీన్ పౌడర్, లడ్డూల తయారీతో పాటుగా డేటా ఎనాలసిస్‌లో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు.

నేడు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక పాత బస్టాండ్ ప్రాంగణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

25 మంది జూదరుల అరెస్టు

ఉంగుటూరు: సంక్రాంతి సందర్భంగా పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. నారాయణపురం టూరింగు పేటలో పేకాట స్థావరంపై దాడి చేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మామిడాల సూర్యభగవాన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,66,020 స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. కంసాలిగుంటలో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

చిల్డ్రన్ హోమ్‌లో అన్నదానం

దెందులూరు: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహాదానమని, చిన్నారులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పోతునూరు ఎంపీటీసీ నున్నా నరేష్, గుంటూరు పోలీస్ కానిస్టేబుల్ సుమన్ అన్నారు. శుక్రవారం విహాన్ చారిటబుల్ ట్రస్ట్ బాలుర చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులకు తన తండ్రి పేరిట కుటుంబ సమేతంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ చిన్నారులంతా క్రమశిక్షణ సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని సూచించారు.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రానికి పాదయాత్ర భక్తులు శుక్రవారం పోటెత్తారు. ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతోపాటు రాజమహేంద్రవరం నుంచి వేలాదిగా తరలివచ్చిన పాదయాత్ర భక్తులకు దేవస్థానం అధికారులు నిత్యాన్నదాన భవనంలో ఉచిత అన్న ప్రసాదాన్ని, స్వామి వారి దర్శనం టికెట్లు అందించారు. తూర్పు రాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపాల్లో, డార్మెటరీల్లో విశ్రాంతి పొందారు. శనివారం ఉదయం శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

ఆస్తి తగాదాలతో ఇద్దరికి గాయాలు

కామవరపుకోట: ఆస్తి తగాదాల నేపథ్యంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో అంకాలంపాడులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అంకాలంపాడుకు చెందిన బలుసు సీతకు తన మొదటి భర్త కుమారుడు గారపాటి హరిబాబుకు ఆస్తి విషయంలో కొంతకాలం నుంచి గొడవ జరుగుతుంది. శుక్రవారం ఉదయం గ్రామంలో వారిద్దరి మధ్య ఘర్షణతో మొదలై ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. తీవ్ర గాయాలైన వీరిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై తడికలపూడి ఎస్సై చెన్నారావు గ్రామంలో వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి ఆక్యుప్రెజర్ వైద్య సేవలు

ద్వారకాతిరుమల: స్థానిక గుడి సెంటర్‌లోని ద్వారకా రెడిడెన్సీలో ఈ నెల 19 నుంచి 24 వరకు ఆక్యుప్రెజర్ ఉచిత చికిత్సా శిబిరాన్ని నిర్వహించనున్నట్టు రెసిడెన్సీ యజమాని వంటిపల్లి ప్రసాద్ తెలిపారు. ఆరు రోజుల పాటు అందించే ఈ చికిత్స నిమిత్తం రోగులు రిజిస్ట్రేషన్ ఫీజుగా కేవలం రూ.200 చెల్లిస్తే సరిపోతుందన్నారు.

365 ఎకరాల పంట భూమికి సాగునీరు

దెందులూరు : సానిగూడెంలోని పెద్ద చెరువు ఆయకట్టు 360 ఎకరాల పంట భూమికి పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తున్నామని పెద్ద చెరువు నీటి సంఘం అధ్యక్షుడు సానిగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్ద చెరువు పరిధిలో 364 ఎకరాల పంట భూమి ఉందని 125 మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. తూరలకు మరమ్మతులు, కాలువ పనులు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు కోటి రూపాయలతో పెద్ద చెరువు ఆయకట్టు సాగు అభివృద్ధి పనులు నిధులు మంజూరైన వెంటనే పనుల ప్రారంభిస్తామని ఆయకట్టు పరిధిలో ప్రతి రైతు సాగునీరు సమస్య పరిష్కారానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాసరావు అన్నారు.

ఉపాధి పనులు వెంటనే చేపట్టాలని వినతి

భీమడోలు: దాళ్వా సీజన్ ముగిసినందున ఉపాధి హామీ పనులు ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు శుక్రవారం భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ వినతిపత్రం అందించారు. గుండుగొలను గ్రామ సభలో నిర్ణయించిన పనులను ఉపాధి హామీ పథకం అధికారులు చేపట్టాలని, ఉపాధి హామీ కూలికి 100 రోజుల పనిని కల్పించాలని, కూలీ ఖాతాల్లోనే నగదును జమ చేయాలని కోరారు. గతేడాది జూన్‌లో చేసిన ఉపాధి కూలీల్లో కొంత మందికి నేటికీ నగదు జమ కాలేదన్నారు. ఆ శాఖ పీడీ, ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలను అందించినట్లు ఆయన తెలిపారు.